# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 11 సెప్టెంబరు , 2025 | పేజీలు : 06


## జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కొలనుపాక సీతారామారావు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కొలనుపాక సీతారామారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నల్గొండ జిల్లా స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె సీతారామారావు బదిలీ చేయడంతో సూర్యాపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పనిచేయనున్నారు.

# గురు శిష్య బంధం పవిత్రమైంది

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సమాజంలో గురు శిష్య బంధం ఎంతో పవిత్రమైందని, విద్యార్థులకు సరైన విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవం 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయుడుగా ప్రయాణం మొదలుపెట్టి రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా, యూనివర్సిటి వైస్ ఛాన్సలర్‌గా ఎన్నో గొప్ప పదువులు పొందారన్నారు. వారిని స్పూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లను ఎంతగానో పెంచారని అలాగే నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఫలితాల్లో కూడా ఈ సంవత్సరం రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నారని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలు పెంచుకొని, నూతన బోధన పద్ధతులు నేర్చుకొని విద్యార్థులను నవీన సాంకేతిక వైపు ఆలోచించేలా తయారు చేయాలన్నారు. విద్యార్థులు నిజ జీవితంలో సైన్స్ యొక్క ఉపయోగాలు తెలుసుకొని ఆవిష్కారణాత్మక ఆలోచనల వైపు ముందడుగు వేసే విధంగా అప్లికేషన్ మెథడాలజీని ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని ముందంజలోకి తీసుకొని రావాలని అలాగే విద్యార్థులకు ఏదైనా ఒక సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే వారిని ఆ సబ్జెక్టుపై పూర్తి అవగాహన తెచ్చుకునే విధంగా తయారు చేయాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా గొప్పదని జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కష్టపడుతున్నారని వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపికైన 40 మంది ఉత్తమ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సన్మానం చేసి ప్రశంస పత్రాలు, మెమోరాండం అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె అశోక్, కోఆర్డినేటర్లు శ్రావణ్ కుమార్, రాంబాబు, పూలమ్మ, మారం పవిత్ర, చత్రు నాయక్, యల్లయ్య, మండల విద్యాధికారులు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీ కొట్టు వద్ద కామ్రేడ్స్ తేనీటి పలకరింపు



**ప్రజాపక్షం/మునుగోడు:** సాధారణ మనిషి తనకు కనిపించే హోటల్‌కు వెళ్లి టీ తాగడం సహజం. అయితే కమ్యూనిస్టు పార్టీ పెద్దలు ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యేలు తమకు కావలసిన టీ కోసం చిన్న కొట్టు వద్ద ఆగి అక్కడే టీ తాగుతున్న సాధారణ ప్రజలను పలకరింపుతూ వారితో కలిసి సాదాసీదాగా టీ తాగారు. బుధవారం సాయంకాలం వేళలో ప్రజలందని ఆశ్చర్యపరిచే విధంగా మునుగోడు మండల కేంద్రంలో జరిగిన సంఘటన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు టీ తాగుతూ మునుగోడు నియోజకవర్గం నుండి వెళ్తున్న త్రిపుల్ ఆర్‌లో నష్టపోతున్న రైతాంగాన్ని నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడాలని చర్చించుకున్నారు.వారి వెంట ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజాచారి, ఈదులకంటి కైలాస్ తదితరులు ఉన్నారు.

# పెద్దోళ్లకేనా... యూరియా ?

### యూరియా కోసం చిన్న రైతులకు తప్పని తిప్పలు
### ఫర్టిలైజర్ షాప్‌లో భారీగా నిల్వలు
### అదనపు ధరలకు విక్రయం
### పట్టించుకోని వ్యవసాయాధికారులు
### పెద్దలకు రాచబాట ... చిన్నోళ్లకు క్యూలైన్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాపాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదు.... ఎన్నో కష్టాలు పడి అప్పులు చేసి వ్యవసాయం చేద్దామని నాగలి పట్టుకుంటే వ్యవసాయానికి అవసరమయ్యే ఎరువులు దొరకడం కష్టతరంగా మారింది. పెద్దోళ్లకు సులభంగా దొరుకుతున్న యూరియా..చిన్న రైతులకు దొరకకపోవడంతో రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడి వ్యవసాయాన్ని ఆగం చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా ఐదు ఎకరాలకు మించిన రైతు క్యూలైన్‌లో నిలబడిన దాఖలాలు కనపడకపోవడంతో యూరియా అక్రమ రవాణా ఎంత మేరకు సాగుతుందో అధికారులకు తెలియాలి. పాపం, పుణ్యం తెలియని చిన్నసన్నకారు రైతులు ఎరువుల బస్తాల కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నప్పటికీ ఇటు పాలకులకు, అటు అధికారులకు కనికరం లేకపోవడం దురదృష్టకరం...

ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుంది. ఒకటి, రెండు బస్తాల కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో నిలబడి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక వైపు కేంద్రం నుంచి తక్కువ మొత్తంలో యూరియా దిగుమతి కావడంతో కొరత ఏర్పడగా మరోవైపు ఫర్టిలైజర్ షాపులకు చెందిన యాజమాన్యం ప్రైవేట్ గోదాముల్లో భారీగా నిల్వ ఉంచడం కొరతకు చెందిన ప్రధాన కారణంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పురుగు మందుల షాపుల యాజమాన్యం తమ సొంత గోదాముల్లో నిల్వ చేయడంతో కృత్రిమ కొరత ఏర్పడినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం వస్తున్న యూరియాను ప్రభుత్వ సంస్థల(కోఆపరేటీవ్ బ్యాంకులు) ద్వారానే అందచేస్తుంది. వచ్చిన దిగుమతిని బట్టి సంస్థ పరిధిలోని రైతులకు యూరియాను సరఫరా చేస్తున్నారు. దీంతో కేవలం సన్నకారు రైతులు మాత్రమే యూరియాకు ఇబ్బందులు పడుతున్నారే తప్పా పెద్ద రైతులకు అనుకున్న సమయానికి యూరియా దొరకుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు గోదాముల్లో భారీగా నిల్వలు ఉన్నప్పటికీ వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యం బ్లాక్‌లో నిల్వలకు పాల్పడుతున్నారు.

ప్రతి గ్రామంలో రెండుకు మించి ఫర్టిలైజర్ షాపులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బెల్ట్‌షాపుల కంటే అనుమతులు లేని యూరియా షాపులే ఎక్కువగా ఉంటున్నాయని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చిన్న గ్రామం మొదలుకుంటే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా నిల్వలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో, ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకోని ముందస్తుగానే యూరియాను నిల్వ ఉంచినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో వ్యవసాయశాఖ అధికారుల బంధువుల సైతం ఫర్టిలైజర్ షాపులను నిర్వహిస్తుండడం వల్ల అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటి పరిదిలోని ఒక్కొక్క షాపు యాజమాన్యం 2వేలకు పైగా బస్తాలు నిల్వ ఉంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బ్లాక్‌లో నిల్వ ఉంచిన యూరియాను ఎక్కువ మొత్తం బిల్లు చేసే రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

అక్రమంగా నిల్వ ఉంచిన యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో యూరియా అవసరమున్న రైతులకు బస్తాకు రూ.80 నుంచి రూ.120 అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా యూరియాను రాత్రి వేళల్లో తరలిస్తున్నట్లు నియోజకవర్గ ప్రజలు పేర్కొంటున్నారు. బిల్లు అడిగితే యూరియా ఇచ్చేది లేదని యాజమాన్యం పేర్కొంటున్నట్లు రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వ గోదాములకు వచ్చిన యూరియా నిల్వలు రాత్రికిరాత్రే కావాల్సిన వారికి ఆటోల్లో, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ గోదాము వద్ద చూసినా ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న రైతులే క్యూలైన్‌లో నిలబడుతున్నారని, ఎక్కడ కూడా ఐదు ఎకరాల కంటే ఎక్కువగా ఉన్న వారు క్యూలైన్‌లో నిలబడకుండానే సులభంగా వారికి ఎలా యూరియా అందుతుందో తెలియడం లేదని వాపోతున్నారు. అధికారులు సైతం దళారులకు కుమ్మక్కై అధిక మొత్తంలో డబ్బులు తీసుకోని అక్రమంగా యూరియాను తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఓ గ్రామానికి వచ్చిన 560 బస్తాల యూరియా నిల్వలు రాత్రికిరాత్రే అనుకున్న వారికి ఓ ఆటోలో సంబంధిత అధికారి చేరవేశారనే ఆరోపణలు రావడంతో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోని సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. ఏదిఏమైనప్పటికీ రైతులకు సక్రమంగా చేరాల్సిన యూరియా అక్రమంగా దళారుల చేతిలో పడి రైతును ఆగం చేయడం సబబు కాదని మేధావులు సైతం అభిప్రాయ పడుతున్నారు.



## పాదయాత్రికులకు వంట సరుకులు అందజేత

**ప్రజాపక్షం/చిట్యాలః** మహారాష్ట్రలోని పాండు రంగా పురం నుండి విజయవాడ కనకదుర్గ ఆలయం వరకు సుమారు వెయ్యి కిలోమీటర్లు పాద యాత్ర చేస్తున్న బృందానికి వంట సరు కులను అందజేశారు తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, బిజెపి నేత కూనూరు సంజ య్‌దాస్. శ్రీశ్రీ శంకరనందా అన్నపూర్ణ ఆశ్ర మానికి చెందిన పాద యాత్ర బృందం బుధ వారం చిట్యాలకు చేరుకుంది. ఈ సంద ర్భంగా వారిని కలిసిన సంజయ్‌దాస్ వారి పాదయాత్ర సంకల్పాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు గుండాల నరేష్, ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్య దర్శి మాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కెఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు మొదటి బహుమతి



**ప్రజాపక్షం/కోదాడ:** నల్లగొండ జిల్లా కేంద్రం లోని మహాత్మాగాంధీ యూనివర్శిటిలో ఈనెల 8, 9 తేదీలలో నిర్వహించిన అంతర్‌జిల్లా కళా శాలల కబడ్డీ పోటీలలో కెఆర్‌ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల మొదటి బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హదసరాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 18జట్లు పాల్గొన్న ఈ కబడ్డీ పోటీలలో కెఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళా శాల విద్యార్థులు ఫైనల్లో ఎస్జీ అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల జట్టుపై విజయం సాధించి మొదటి బహుమతిని కైవ సం చేసుకున్నారు. ఈసందర్భంగా బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా శాల అధ్యాపకులు పి.ప్రాన్సిస్, ఎస్‌ఎం రఫీ, కబడ్డీ కోచ్ నామ నర్సింహరావు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణపై దృష్టి

**ప్రజాపక్షం/మునగాల:** విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై విద్యార్థుల తల్లిదండ్రులు దృష్టిసా రించాలని మునగాల తహసిల్దార్ సరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హస్టల్‌లో విద్యార్థుల తల్లిదం డ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లా డారు. విద్యార్థుల తల్లిదండ్రులు హస్టల్‌లో పెడుతున్న మెను అమలు చేసే విధానంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఎంపీవో నరేష్, మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బిఎస్‌గౌడ్, విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడతోపాటు వివిధ గ్రామాలకు చెందిన వివిధ గ్రామాల నుంచి విద్యను అభ్యసించడానికి పేద విద్యార్థులు బస్‌పాస్‌ల మీద ఆధారపడి తుంగపాడు మోడల్ స్కూల్, కళాశా లకు వెళ్తున్నారని, విద్యా సంస్థలకు సమయానుకూ లంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని, వెంటనే అధికారులు తుంగపాడు మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని పీఎ స్‌యు జిల్లా కోకన్వీనర్ నల్లగంతుల అజయ్ కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందించి మాట్లాడారు. తుంగపాడు మోడల్ స్కూల్, కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, బస్ చార్జీల పెంపుతో పేద విద్యా ర్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోని విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందించాలని, మోడల్ స్కూల్‌కు సమయానుకూలంగా బస్సులను నడపాలని కోరారు. కార్యక్రమంలో వరికుప్పల రవిశంకర్, మణి, ఎండి. ఫయాజ్, అజయ్, సతీష్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వేళకు బస్సు రావడం లేదని నిరసన




**ప్రజాపక్షం/చిట్యాలః** వేళకు బస్సు రాక ఇక్కట్లకు గురౌ తున్న విద్యార్థులు ఆర్‌టిసి బస్సును నిలిపి వేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన బుధవారం రోజున నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటనా వివరాలిలా ఉన్నాయి. పెద్దకా పర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల నుండి నిత్యం చౌటుప్పల్, హైదరాబాద్‌కు విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. గతంలో ఈ గ్రామాలకు ఉదయం 7.30 నుండి 8.30 గంటల మధ్య పల్లె వెలుగు బస్సు ఆయా గ్రామాల నుండి దిల్‌షుక్‌నగర్‌కు ఒక బస్సు నడి చేది. కాగా గత కొద్ది రోజుల క్రితం ఈ బస్సును నిలిపివే యడంతో ఆ సమయంలో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత బస్సు వస్తుండటంతో విద్యార్థులు కళాశాలలకు, పని స్థలాలకు ఉద్యోగులు సమయానికి చేరుకోలేక ఇక్కట్లుకు గురౌతున్నారు. దీంతో విసుగు చెందిన వీరంతా నేడు తమ గ్రామానికి వచ్చిన బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. మా సమ యానికి అనుకూలంగా బస్సును నడపాలని వారు డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/కోదాడ:** ఉపాధ్యాయులు పదోన్నతిని అవ కాశంగా స్వీకరించి బాధ్యతయుతంగా అంకితభావంతో పనిచేసి వృత్తిలో రాణించాలని కోదాడ మండల విద్యాధి కారి సలీంషరిఫ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణం లోని బాలుర ఉన్నత పాఠశాలలో పదోన్నతులు పొంది విధులలో చేరిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని, విద్యార్థులకు విద్యను అందించడంలో బోధన నైపుణ్యంతో రాణించా లని కోరారు. ఆంగ్ల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు మీనాక్షి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా వనపర్తి జిల్లా జడ్పిహెచ్‌ఎస్ కొప్పునూర్‌లో విధులలో చేరారు. డిప్యూ టేషన్ మీద పనిచేస్తున్న ఎండి ముక్తార్ సూర్యాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. పిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బ్రహ్మానందం జడ్పిపిహెచ్‌ఎస్ నేలమ ర్రిలో చేరారు. వీరిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతిలో ప్రథమస్థానం మార్కులు పొందిన విద్యార్థు లకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మార్కేండేయ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, వీరబ్రహ్మ చారి, ఖాజామియా, పాండురంగాచారి, వేణుకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

## 16న కోదాడలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ



**ప్రజాపక్షం/కోదాడ:** సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం కోదాడలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన కోదాడ నియోజకవర్గ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వతంత్ర్య సమరయోధులు కుటుంబంలో జన్మించిన సుధాకర్‌రెడ్డి వారి పెద్దనాన్న తండ్రి వారసత్వంలో ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షింపబడి 83 సంవత్సరాలు సంపూర్ణంగా జీవించిన ఆయన ఆగస్టు 22న భౌతికంగా మన నుంచి దూరమయ్యాడని అన్నారు. ఈనెల 16న కోదాడలోని కాశీనాథం ఫంక్షన్‌లో జరిగే సంస్మరణ సభను సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. ఈ సంతాప సభకు భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశే ఖర్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లు నాగార్జున రెడ్డి లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లత్తు, హనుమంతరావు, సాయి బెల్లి పాల్గొన్నారు.



## కెఆర్‌ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల యూజి 2 సెమిస్టర్ ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని కెఆర్‌ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల రెగ్యులర్ యూజి 2 సెమిస్టర్ ఫలితా లను బుధవారం మహాత్మాగాంధీ యూనివర్శిటి పరీక్షల నియం త్రణ అధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హదస రాణి లు విడుదల చేశారు. కెఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా ర్థులు యూజి సెమిస్టర్ 2 ఫలితాల్లో కళాశాల విద్యార్థులు బిఎ స్సీలో 60శాతం, బీకాం కంప్యూటర్‌లో 58.34 శాతం, బిఎలో 57.5 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫరీక్షల్లో బిఎస్సీలో 95.65 శాతం, బికాం కంప్యూట ర్‌లో 84 శాతం, బిఎలో 85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల విభాగం నియం త్రణ అధికారి డాక్టర్ బి.సైదిరెడ్డి, కెమిస్ట్రి అధ్యాపకులు నాగిరెడ్డి, ఎస్‌ఎం రఫీ అధ్యాపకులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుల నివాళి...



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** ఆర్యవైశ్య ప్రముఖులు,హుజూర్‌నగర్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గెల్లి అప్పారావు బుధ వారం మృతి చెందారు. సిపిఐ నాయకులు గెల్లి అప్పారావు మృతదే హంపై పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. రైస్‌మిల్లు లల్లో పనిచేసే కార్మికుల పట్ల అండగా నిలిచేవారని గుర్తుచేశారు. సిపిఐ పార్టీకి గెల్లి అప్పారావుకు ఉన్న స్నేహబందాన్ని గురించి కొని యాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా రైతుసంఘం కార్యదర్శి కంబాల శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,సోమగాని కృష్ణ,జడ వెంకన్న, దొంతగాని సత్యనారాయణ,ఇందిరాల వెంకటేశ్వర్లు,యల్లావుల రమేష్,జడ శ్రీనివాస్,యల్లావుల ఉమ,చెన్నగాని సైదులు,చక్రాల స్టాలిన్,చక్రాల వెంకన్న,గుండా రమేష్,కృష్ణారెడ్డి,స్వామి,ప్రసాద్, మల్లయ్య రమణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగరి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఇందిరాల జ్యోతి తమ అద్భుతమైన బోధన తులు,విద్యార్థులపై చూపుతున్న అంకితభావం,చిత్తశుద్ధి కారణంగా ఈ సంవత్సరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు ను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతులు మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరాల జ్యోతి మాట్లాడుతూ ఈ అవార్డు తమ పాఠశాల విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,సిబ్బంది సహకారాలనికి ప్రతిఫలంగా లభించిందన్నారు. ఆమెకు అవార్డు రావడం పట్ల మండల విద్యాధికారి సైదా నాయక్,లింగగిరి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ పెనుగొండ శ్రీనివాస్,హెచ్‌ఎమ్ గాయం ధనలక్ష్మి,ఉపా ధ్యాయులు నజీమా అంజుమ్,చందు హర్షం వ్యక్తం చేశారు.





## దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల భూమిపూజ

**ప్రజాపక్షం/చండూరు:** ఈ నెల 22 నుండి ప్రారంభం కానున్న దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పుర ష్కరించుకొని బుధవారం శుభ ముహూర్తం ఉన్న సంద ర్భంగా దుర్గాదేవి కొలువుదీరనున్న ప్రదేశంలో భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు.చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో శ్రీశ్రీశ్రీ కనక దుర్గా యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆద్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేసులు ఎత్తివేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** గ్రూప్ 1 పరీక్షలను పారదర్శ కంగా నిర్వహించాలని, గ్రూప్1 విషయంలో ఆందో ళన చేసిన విద్యార్థులపై పెట్టిన కేసులు కూడా వెంటనే ఎత్తివేయాలని బిజెవైఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుదవారం ఆయన చండూరులో మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులతో చెడుగుడులాడు తుందని నిరుద్యోగులకు కాంగ్రేస్ ప్రభుత్వం మీద నమ్మకం పోయిందని అన్నారు. గ్రూప్1 నిరుద్యోగు లకు న్యాయం జరుగకపోతే బిజెపి అండగా ఉంటు పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని అన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరు ఎంపిపిఎస్ పాఠ శాల హెచ్‌మాస్టర్ రాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు అందుకున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశంలో గుండాల మండల విద్యాధికారి మన్నె అగ్గిరాములు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ చంద్రకళ, ఎంఆర్‌సి సిబ్బంది, జెడ్పిహెచ్ ఎస్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వ ర్యంలో హెచ్‌ఎం రాజును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సిఆర్‌పి లింగయ్య, నరేష్, అజీమో ద్దిన్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బైకు దొంగలకు ఏడాది జైలు శిక్ష

**ప్రజాపక్షం /హాలియా:** బైకు దొంగతనాలకు పాల్పడు తున్న ఇద్దరి యువకులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు ప్రకటించారు. హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై నెలలో బైక్ దొంగతనాలు చేస్తూ హాలియా పోలీసులకు పట్టుబడిన దేవన బోయిన శ్రీను, వేముల నాగరాజు లను అరెస్టు చేసి రిమాండ్ పంపారు. దీనిపై విచారణ చేసిన నిడమ నూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వప్న దొంగత నాలకు పాల్పడుతున్న దేవన బోయిన శ్రీను, వేముల నాగరాజు లకు ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తూ బుధ వారం తీర్పు వెల్లడించారు.

# ప్రజల డాక్టర్‌గా రాములునాయక్ ఎనలేని సేవలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ నియోజకవ ర్గంలో పేరొందిన ప్రముఖ డాక్టర్ రాములు నాయక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎన్నో ఏళ్ల పాటు సూపరిండెంట్‌గా సుధీర్ఘ సేవలు అందించి వేల కుటుంబాలకు ఆపద్భాందవుడుగా నిలిచారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలోని సాయిశివ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ రాములునాయక్ సంస్మరణ సభలో పాల్గొని రాములునాయక్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వృత్తినే దైవంగా భావించే మహోన్నత వ్యక్తి అందరితో స్నేహంగా ఉండి, సమాజంలో గౌరవమైన స్థానాన్ని సంపాదించుకున్న డా. రాములునాయక్ ప్రజల్లో విశేష ఆదరణ పొందారని అలాంటి రాములునా యక్ మరణం నియోజకవర్గ ప్రజలను కలచివేసిం



దని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రాగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి యూనుస్, సిపిఐ నాయకులు మైనోద్దిన్, జ్యోతిబస్, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# పది ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణతకై కృషి చేయాలి



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలం లోని యల్లారెడ్డి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలను రాష్ట్ర జాయింట్ డైరె క్టర్ విజయ లక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లం బిక్షపతి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధ వారం నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ఉపాధ్యాయు లకు ఎఫ్ ఎల్ ఎన్ ఒక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ ఆసక్తి చూపించాలని విద్యార్థులు విషయ పరిజ్ఞానాల్లో మెరుగుపరచాలని. విద్యార్థులకు ధారాళంగా చద వడం, రాయడం ముఖ్యంగా నేర్పించాలని సూచిం చారు. రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ విజయ లక్ష్మి మాట్లా డుతూ ఈ సారి కూడా గత సంవత్సరం లాగా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. తదుపరి మధ్యాహ్న భోజనాన్ని తను స్వయంగా పరిశీలించి విద్యార్థు లతో మధ్యాహ్న భోజనం చేసి,మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలని. తగిన సూచనలు,సలహాలు చేశారు. అనంతరండీఈవో నార్కట్ పల్లి మండలంలో ఈ పాఠశాల విద్యార్థి మండల ప్రథమ స్థానం సాధిం చడం గొప్ప విషయం అని, దానిని ఈ సారి కూడా నిలబెట్టుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఎన్‌ఓ యన్. వెంకటేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి హిమజ, కాంప్లెక్స్ ప్రధా నోపాధ్యాయులు డి రాములు,ఉపాధ్యాయినీ ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

## సేవాపక్షం సందర్భంగా జిల్లాలో సేవా కార్యక్రమాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్ష పేరుతో జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వ హించాలని రాష్ట్ర సీనియర్ నాయకులు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్య క్షురాలు చల్ల శ్రీలతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాపక్ష జిల్లా కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్ర మంలో భాగంగా 17న రక్తదాన శిభిరం, 18న మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆత్మనిర్బర్ భారత్, వికసిత భారత్ అంశాలపై చిత్రలేఖన కార్యక్రమాలు, శక్తికేంద్ర, మండల కేంద్రాలలో స్వచ్ఛభారత్ కార్య క్రమం, 21న యువమోర్చా ఆధ్వర్యంలో 2, 3 కిలో మీటర్ల నమో మారథాన్ కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. 25న బూత్ స్థాయిలో మొక్కలు నాటి దీన్ దయాళ్‌జికి నివాళులర్పించడం, జిల్లా స్థాయిలో మేధావులతో సమావేశం, డాక్యుమెంటరి ప్రదర్శన, ఖాదీ స్టాల్ ఏర్పాటు, 27న ఎమ్మెల్యే, ఎంపి నియో జక వర్గాలలో దివ్యాంగులకు ఉపకరణాలు,



సన్మానం, 28న పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూ షణ్, అర్జున అవార్డులు పొందిన వ్యక్తులకు సన్మాన కార్యక్రమం, 2న మహాత్మాగాంధీజీకి నివాళి, లాల్‌బ హదూర్ శాస్త్రి చిత్రాలకు పుష్పాంజలి, ఖాదీ ఉత్ప త్తుల కొనుగోలు వంటి కార్యక్రమాలు నిర్వహించా లని తెలిపారు. అంతకు ముందు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ తుక్కాని మన్మధరెడ్డి, జిల్లా సేవా పక్ష ప్రోగ్రామ్ కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు, జిల్లా కోకన్వీనర్లు జిల్లా జనార్ధన్, అనంతుల గురవయ్య పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ వీరనారి చాకలి ఐల మ్మను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు రజక సంఘం నాయకులు అన్నారు. బుధ వారం ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్ర హానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సట్టు నాగే శ్వరరావు, పిల్లుట్ల కృష్ణయ్య, సట్టు ఎల్లయ్య, నాగేంద్ర, లింగయ్య, సింహచలం, రాంబాబు, సతీష్, సురేష్, గోపాలకృష్ణ, వెంకన్న, వీరయ్య, కోటి పాల్గొన్నారు.





## డాక్టర్ రాములునాయక్ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రాములునాయక్ గత కొన్ని రోజుల క్రితం మరణిం చడం తీవర దిగ్బ్రాంతిని కలగజేసిందని ఆయన మృతి నియోజక వర్గ ప్రజలకు తీరనిలోటని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునా యక్, ఎంఎల్‌సి శంకర్‌నాయక్, మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమా ర్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన డా. రాములునాయక్ సంతాప సభలో పాల్గొని రాములునాయక్ సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు రమేష్‌నాయక్, లాలునాయక్, నర్సింహా, జాన్ యాదవ్, సర్వయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, వైద్యులు, స్నేహితులు, అభిమానులు, జర్న లిస్టులు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి స్వీట్ హౌస్‌పై కేసు నమోదు



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలో చౌటుప్పల్ రోడ్ లో ఉన్న శ్రీ మహాలక్ష్మి స్వీట్ హౌస్ దుకాణం పై ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సీట్ హౌస్ లో నాణ్యత లేకుండా సీట్ హౌస్ దుకాణం నిర్వహిస్తు న్నారని సదర్ దుకాణంపై చర్యలు చేపట్టాలని ఫుడ్ సేఫ్టీ అధికారు లకు ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు బుధవారం స్వీట్ హౌస్ దుకాణం పై అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తని ఖీలో తయారుచేసిన స్వీట్ పదార్థాలను పరిశీలించగా ఈగలు, దోమలతో పాటు మానవునికి హానికరించి రసాయనాలు వాడుతు న్నారని గుర్తించి స్వీట్ హౌస్ పై కేసు నమోదు చేశారని విశ్వసనీయ సమాచారం.

## పోస్ట్ ఆఫీస్ ఎత్తేసే ప్రయత్నం విరమించుకోవాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టనంలో ఐబి వెనక గల పోస్ట్ ఆఫీస్‌ను ఎత్తివేయాలనే ప్రయత్నం ను మానుకోవాలని బుధ వారం ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు పొట్ట ప్రభు ఆధ్వర్యంలో వికలాంగులతో కలిసి ఎస్‌పిఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోస్ట్ ఆఫీస్ ద్వారా 1500 మంది పెన్షన్ దారులు, సుకన్య ఖాతా దారులు, పిఎల్‌ఐ, ఆర్డి అకౌంటెంట్లు ఉన్నారని, పట్టణ జనాభా దృష్టిలో ఉంచుకొని పోస్ట్ ఆఫీస్‌ను కొనసాగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పి ఎస్ రాష్ట్ర నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, జిల్లా అధ్యక్షులు ఏసన్న, పెన్షన్ దారులు, మహిళలు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/చిట్యాల:** రజాకార్లను ఎదురొడ్డి నిలిచి భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన చాకలి ఐలమ్మకు సిపిఎం నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. ఆమె 41వ వర్ధంతిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి పార్టీ నాయకులు ఘణంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు పాల్గొని మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చూపిన తెగువ నారీ లోకానికి, దేశానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు పామనుగుళ్ల అచ్చాలు, ఐతరాజు నర్సింహ్మా, నకిరేకంటి రాములు, పామనుగుళ్ళ దశరథ, గోపా, వెంకులు, వివిధ పార్టీల నాయకులు పల్లపు బుద్ధుడు, కోనేటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలోని చౌరస్తాలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు



ఊట్కూరి వేమన్‌రెడ్డి, పిఏపల్లి మాజీ వైస్ ఎంపిపి అర్వపల్లి సరిత నర్సింహా, బంజారా సేవా సంఘం అధ్యక్షుడు లాలునాయక్, మాజీ ఎంపిటిసి జగన్, సత్తయ్య స్వామి, భూతరాజు భరత్, వరికుప్పల శ్రీను, సైదులు, దాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థలు అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సాగర్ రోడ్డులో ఆమె విగ్రహానికి రజక సంఘం నాయకులతో కలిసి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇలియాస్, నల్లగంతుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ రైతాంగ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం మండల పరిధిలోని రేపాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బిసి నాయ



కులు, వివిధ పార్టీల నాయకులు సొంపంగు జానయ్య, పెరేల్లిబాబు, తుమ్మ సతీష్, ఎర్ర వెంకటేశ్వర్లు, బెజవాడ మధు, గంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిసి బ్యాంక్ డైరెక్టర్ సింగారం ఉప్పలయ్య, మరిపడిగ మాజీ ఎంపిటిసి సింగారం సునిత, తెలంగాణ రజక సంఘం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సురిగల రమేష్, మండల మాజీ అధ్యక్షులు భాస్కర్, రజక సంఘం మండల నాయకులు సోమరాజు, శేఖర్, నాగరాజు, రమేష్, కనకయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నందికొండ:** చాకలి ఐలమ్మ వర్ధంతిని నందికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక రజక సంఘ నాయకులు విజయ్ విహార్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమం లో సాగర్ రజక సంఘం నాయకులు సిహెచ్ విజయ, జంగయ్య ,వెంకన్న, పూర శ్రీనివాస్ ,వెంకటేశ్వర్లు, దుర్గయ్య, వేణు, రాము,





## ఎల్‌ఒసి అందజేత

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్న నార్కట్‌పల్లి మండలం ఎపి లింగోటం గ్రామానికి చెందిన శేక్ నన్నిబి కి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (ఎల్ఓసి) ద్వారా మంజూరెన రూ.2.50 లక్షల కాపీని వారి కుటుంబ సభ్యులకు చెరువుగట్టు మాజీ ధర్మకర్త గడ్డం పశుపతి అందజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు నాగరాజు, నియోజకవర్గ యువ నాయకుడు కొరివి శివరామ్, బైరెడ్డి రాంగోపాల్ రెడ్డి, యువ నాయకులు తండ సైదులు, ఓరుగంటి శివకుమార్, మెడబోయిన కల్యాణ్, రాజేష్, బెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ భాష తెలుగు పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పున్నమి అంజయ్య రచించిన విశ్వ భాష తెలుగు పద్యగేయ కవితా సంకలనం పుస్తకాన్ని ప్రముఖ కవి రచయిత డాక్టర్ కర్నాటి లింగయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహితీ మేఖల సంస్థ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం తెలుగు భాషా వికాసం కోసం 92 ఏళ్లుగా కృషి చేస్తుందన్నారు.ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాలలోని 126 మంది కవులు రచయితల కవితలు గేయాలు పద్యాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమని అన్నారు. పుస్తక రచయిత పున్నమి అంజయ్య మాట్లాడుతూ డాక్టర్ కర్నాటి లింగయ్య గారు ఈ పుస్తక స్వీకర్త గా ఆయన గొప్ప మానవతా వాది అని కొనియాడారు.

## తిరునగు భార్గవ్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తిరునగరు గంగాధర్ సతీమణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ మాతృమూర్తి మల్లేశ్వరమ్మ(85) బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థలు మల్లేశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భార్గవ్ కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట మాజీ మార్కెట్ ఛైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, లింగారెడ్డి, ఇంజం శ్రీధర్, అశోక్, గంగుల భిక్షంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతలో హెచ్ఐవిపై అవగాహన పెంచాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యూత్ ఫెస్ట్ 2025 లో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జి డిగ్రీ కాలేజ్ లో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశానుసారం జిల్లా స్థాయి 5కె రెడ్ రన్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. యువతలో హెచ్ఐవిపై అవగాహన కల్పించడం కొసం పరుగు పందెంను ప్రభుత్వవైద్య కళాశాల ప్రొఫసర్ డాక్టర్ నరసింహ రావు నేత,కళాశాల ప్రిన్సిపల్ సముద్రాల ఉపేందర్ చేతుల మీదుగా జెండా ఊపి పరుగు పందెం ప్రారంబించారు. కళాశాల నుండి గడియారం చౌరస్తా వరకు సాగింది. ఈ కార్యక్రమం ద్వారాహెచ్ ఐవ పై అవగాహన కల్పించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారి యొక్క హెచ్ఐవిస్థితి తెలుసుకోవాలని పిలుపునిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. తదనంతరం మొదటి ద్వితీయ బహుమతి విజేత లైన ఆర్ రవీందర్,ఎల్. పూజలకు ప్రైజ్ మనీ ఇవ్వడంతోపాటు మొదటి బహుమతి విజేతలను ఈ నెల 12 వ తేదీన హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకి పంపనున్నామని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్ట్ మేనేజర్ సుధాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఏన్ఎస్ఎస్ పిడి కాదరి మల్లేశం,కోటయ్య,కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది. స్థానిక ఏఆర్‌టి సిబ్బంది, సురక్ష క్లినిక్ సిబ్బంది వివిద స్వచ్చంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నందికొండ:**రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీ లోని హైదరాబాద్ ప్రధాన రహదారి పై స్థానిక ఫిల్టర్ హౌస్ మూల మలుపు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది . అక్కడున్న ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుండి మాచర్ల వైపు బొప్పాయి లోడుతో వెళుతున్న మ్యాక్స్ క్యాబ్ ట్రాన్స్పోర్ట్ వాహనం స్థానిక ఫిల్టర్ హౌస్ మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా అతి వేగంతో హైదరాబాద్ వైపు వస్తున్న టిజి 05 సి3471 కియా వాహనం ట్రాన్స్పోర్ట్ వాహనాన్ని బలంగా ఢీకొనడంతో అది వెళ్లి అదే సమయంలో ట్రాన్స్పోర్ట్ వాహనం వెనకాల ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుని ఢీకొనడంతో కియా వాహనం ద్విచక్ర వాహనం రెండు రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోవడం జరిగింది. ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయి కారులో తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయిన వ్యక్తిని స్థానికులు



కాపాడగా బైక్ నడుపుతున్న వ్యక్తి స్థానిక స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సులో కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడని తీవ్రంగా గాయాల పాలైన ఆ ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా కమలా నెహ్రు ఆసుపత్రికి తరలించడం జరిగింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొనగా ఈ ఘటనపై తమ కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగార్జున తెలిపారు.

## ఆర్తి కవికి అభినందనలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 2024 సంవత్సరానికి గాను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నల్లగొండకు చెందిన ప్రముఖ కవి బైరెడ్డి కృష్ణారెడ్డికి కీర్తి పురస్కారం ప్రకటించింది. బైరెడ్డి కృష్ణారెడ్డి ఆర్తి ఐదు కవిత్వ సంపుటాలను వెలువరించారు. మానవీయ బంధాలు,ఆర్ద్రత కలిగిన కవిత్వం రాసే బైరెడ్డి కృష్ణారెడ్డికి ఆర్తి కవి అని పేరు. ప్రతిష్టాత్మకమైన కీర్తి పురస్కారం రావడం పట్ల బైరెడ్డి కృష్ణారెడ్డిని నల్లగొండకు చెందిన సాహితీవేత్తలు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, సృజన సాహితీ అధ్యక్ష కార్యదర్శులు పెరుమాళ్ళ ఆనంద్ డాక్టర్ సాగర్ల సత్తయ్య, సిలివేరు లింగమూర్తి, డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, దాసోజు శ్రీనివాస్, యర్ర దేవదానం తదితరులు అభినందించారు.

## ఐలమ్మకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండల కేంద్రంలో ఉన్న ఎమ్మార్వో కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ఎమ్మార్వో జోష్ని శ్రీనివాస్ శర్మ, డిప్యూటీ తాహసిల్దార్ కరుణాకర్ చాకలి ఐలమ్మ త్యాగాల జీవిత పోరాటాల విజయాలను ఉద్దేశించి మాట్లాడుతూన్నారు. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా దొరా అని ఉత్పత్తికులాల (బీసీకులాల) చేత పిలుపించుకునే సంస్కృతికి చరమగీతం పాడిన వారిలో చాకలి ఐలమ్మ ముందంజలో ఉన్నారని మండల ఎమ్మార్వో జోష్ని శర్మ డిప్యూటీ తాహసీల్దార్ కరుణాకర్ అన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం

**ప్రతి రైతుకు యూరియా అందించాలి**
**సమస్యల పరిష్కారంకోసం రైతాంగం ఉద్యమబాట పట్టాలి**
**ఎస్‌కెఎం జిల్లా సదస్సులో రైతు సంఘాల నేతలు**




**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఘోరంగా విఫలం చెందుతున్నారని, ఫలితంగా రైతులు నష్టాల ఊబిలోకి నెట్టివేయబడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఐక్యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్మడి నరసయ్య తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ఫ్లాట్ ఫేమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో జిల్లా స్థాయి సదస్సు రైతు సంఘం జిల్లా నాయకులు చంద్ర నరేంద్రకుమార్, అమర్లపూడి రాము అధ్యక్షతన బుధవారం జరిగింది. సదస్సులో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతాంగానికి యూరియా సరఫరాలో కేంద్రం పూర్తిగా విఫలమైందని, దీంతో రైతులు పంటలను నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పత్తి దిగుమతి సుంకం 11శాతం, పత్తికి క్వింటాకు రూ.10,075 చెల్లిచాలని, వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ ఉత్పత్తులను మార్కెఫడ్ ద్వారా కొనుగోలు చేయాలనీ, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల భీమా పథకాన్ని అమలుచేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం భరోసాగా ఉండాలన్నారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు తప్పవని, రైతులను సమీకరించి పాలనను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. సదస్సులో కిసాన్ మోర్చా నాయకులు సలిగంటి శ్రీనివాస్, బుర్రా వెంకన్న, బానోతు ఊక్లా, కోరం వెంకటేశ్వర్లు, కట్ట నాగయ్య, బొప్పన హరిబాబు, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా చికెన్ గున్యా.. మలేరియా కేసులు నిల్



**-డెంగీ కేసులు అంతా రికవరీ**
**-డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్. కళావతిభాయి**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో డెంగీ కేసుల బాధితులు అంతా కోలుకున్నారని..ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. డి.కళావతి భాయ్ పేర్కొన్నారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చెరువుమాధారం, పైనంపల్లి ఉప కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు వద్ద కు వెళ్లి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు.... జిల్లాలో ప్రతీ ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. దాదాపు గా 3.11 లక్షల ఇళ్ల ను సందర్శించినట్లు తెలిపారు. వీటిలో 7.45 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కేవలం 3,712 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డెంగీ 155 కేసులు నమోదు కాగా... వారంతా రికవరీ అయ్యారని పేర్కొన్నారు. చికెన్ గున్యా 4024 మంది కి పరీక్షలు నిర్వహించగా ఒక్క కేసు కూడ నమోదు కాలేదన్నారు. అదే విధంగా మలేరియా 64,914 మందికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ కేసు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా అదుపులో ఉన్నట్లు తెలిపారు భూక్యాప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్న విషయం ను ప్రజలకు తెలిసేలా చైతన్యం చేయాలని అన్నారు. గ్రామాలలో వాటర్ ట్యాంక్లను శుభ్రం చేయటం, మంచినీరు కలుషితం కాకుండా అప్రమతంగా ఉండాలని అన్నారు. పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను చెరువుమాధారం ను, తరలించే విషయం ప్రస్తుతానికి లేదన్నారు. ఉన్న సబ్ సెంటర్ లో సౌకర్యం లేకపోవటం వలన అక్కడ నూతన భవనం నిర్మించిన తరువాతనే మార్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్.ఆర్.శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాండం తొలిచే పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని భగత్‌వీడు గ్రామంలో బుధవారం వరి పొలాలను కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో అక్కడక్కాడా కాండం తొలిచే పురుగును గమనించడం జరిగిందని తెలిపారు. కాండం తొలిచే పురుగు అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశిస్తే, ఈనే దశలో గింజలకు పోషక పదార్ధాలు అందక, గింజలన్నీ తాలు గింజలుగా మారి తెల్ల కంకులు ఏర్పడతాయని, ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం, కరువు పరిస్థితులు తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు, సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువ, నత్రజనికి సంబంధించిన ఎరువులను మోతాదుకు మించి వాడటం ఈ పురుగు ఉధృతికి అనుకూలమైన పరిస్థితులు అన్నారు. చదరపు మీటరకు ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం లేదా 10శాతం చచ్చిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 25,30 మగ రెక్కల పురుగులు గమనించినప్పుడు మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉధృతిని బట్టి సస్యరక్షణ మందులైన క్వినాల్ ఫాస్ 2 మిలీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మిలీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రామ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 0.3 మిలీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 2 గ్రామ లేదా టెట్రానిలిప్రోల్ 05 మిలీ లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గితెగులు గమనించినట్లయితే ట్రిసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సౌమ్య, రవీందర్, రైతులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వేంటనే నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న గ్రామంలో సర్పంచులు లే గ్రామాలలో పరిపాలన అస్తవ్యస్తమైందని అన్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు రాక గ్రామ వ్యవస్థ కుంటిపడిపోయిందని తెలిపారు. గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పాలన ఏర్పడిన తర్వాత ఎవరికి ఏం చెప్పాలో తెలియని స్థితిలో గ్రామ ప్రజలు ఉన్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పై భారం పడడంతో అప్పుల బాధ పడుతున్నారు అని తెలిపారు. నిధులు లేక గ్రామలలో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు లేక, గ్రామలలో వీధిలైట్లు కొరత, పారిశుద్ధం కొరత ఎక్కువగా ఉన్నదని అన్నారు. ఇప్పటి వరకు ఎలక్షన్స్ జరుగక పొవడం చాలా నిర్లక్ష్యమని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎలక్షన్స్ జరిపించి గ్రామాలలో మంచి పాలన చూడాలని కోరారు.

# పిడుగు పాటుకు వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/గుండాల :** మండల పరిదిలోని చీమలగూడెం గ్రామానికి చెందిన పాయం నర్సయ్య (50) గత మంగళవారం చేనువద్దకు వెల్లిన సందర్భంలో కురిసిన భారి వర్షానికి ఉరుముల మెరుపులతో పిడుగు పడటంతో మృత్యువాతకు గురైన సంఘటన చోటు చేకుంది . మృతునికి కుటుంబానికి అన్నివిదాలుగా ప్రభుత్వం ఆదుకావాలని అక్కడి స్తానికులు వేడుకున్నారు. నర్సయ్య మృతదేహాన్ని ఇల్లందు పోస్టు మార్టం నిమిత్తం స్థానిక పోలీస్ ఎస్‌హెచ్‌ఒ సైదా రఫూప్ తరలించి కేసునమోదు చేశారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని మంచినీళ్ల లక్ష్మయ్య లాండ్రీ షాప్ ఎదురుగా బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఆశయాలను మనమందరం ముందుకు తీసుకుపోవాలని, ఆమె పోరాట పటిమను, ఉద్యమ స్ఫూర్తిని ఈసందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గోగినపల్లి సత్యం, మంచినీళ్ల లక్ష్మయ్య, పావురాల లాలయ్య, దునిసరపు మల్లయ్య, కుమ్మరి కుంట్ల శ్రీను, నిమ్మల సత్యం, పావురాల ప్రవీణ్, అద్దంకి భద్రం, అద్దంకి రవి, గోగినపల్లి శివకృష్ణ, దోనెపల్లి వేణు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని బుడ్డగూడెం కేంద్రం అక్రమ ఇసుకను తరలిస్తున్న లారీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుడ్డగూడెం పరిధిలో అక్రమంగా ఇసుకను లారీల ద్వారా రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున బూర్గంపాడు అదనపు ఎస్‌ఐ నాగబిక్షం సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ టిఎస్36టి4438 నెంబర్ కలిగిన లారీని పట్టుకొగా, డ్రైవర్ పరారీ కావడం జరిగిందని తెలిపారు. పట్టుబడిక లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పిడుగు పడి రైతుకు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని మిర్చి తోటలో పిడుగ పడి అదే గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన రైతు గుగులోత్ బావ్‌సింగ్(40)తన మిర్చి తోటలో బుధవారం కూలీలతో సాగు చెట్లు వేయిస్తుండగా వర్షం వచ్చింది. ఇంటికి వద్దామని చేను నుండి వస్తుండగా అతని సమీపంలో పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతనిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు.

# మండలానికి అత్యధిక యూరియా సరఫరా



**ప్రజాపక్షం/గుండాల :** భద్రాద్రి జిల్లా గుండాల మండలానికి పిఏసిఎస్ ద్వార అత్యదికంగా యూరియాను సరఫరాచేయడం జరిగిందని వ్యవసాయశాఖ అధికారి ఎడిఏ తాతరావు అన్నారు. బుదవారం స్థానిక పిఏసిఎస్‌ని సందర్శించి వర్షాకాల సీజన్ గాను ఏప్రిల్‌నుండి సెప్టెంబర్ 9వరకు 24425 యూరియా బ్యాగులను అనగా 1099 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. యూరియా సరఫరాలో జిల్లాలోనే పిఏసిఎస్ ద్వారా రెండో స్థానం ఉందన్నారు. ఇల్లందు మొదటి స్థానం అన్నారు. మండలానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిదిలోని కాచనపల్లి రైతు వేదిక యందు బుదవారం 120 యూరియా బ్యాగులను రైతులకు అందించడం జరిగిందన్నారు. రైతుల అవసరాల మేరకు మండల రైతులకు యూరియా సరఫరా చేయడానికి తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏఒ వెంకటరమణ, ఏఇఒలు బాలరాజు, లెనిన్ ఉన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ పాత్ర విరోచితమైనదని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద బుధవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్నికణం చాకలి ఐలమ్మ అని అన్నారు. అనేకమందికి విప్లవ భావాలను మండించిన నిప్పుల కొలిమి ఐలమ్మ అని తెలిపారు. విస్నూర్ దొర రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలపై అగ్ని కణంలో మారి ముందుకు దూకిన తొలి వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ నాయకులు అనంతు పుల్లయ్య, యెచ్చర్ల గౌరి శంకర్, చెన్నబోయిన మల్లయ్య, అబ్దుల్ సత్తార్, గుడిమెట్ల శ్రీనివాసరావు, బడుగు మాధవరావు, మూడు శ్రీనివాసరావు, భూక్యా నాగేశ్వరరావు, కాసాని వెంకన్న, కోండ్రుగొట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం లేఅవుట్ అనుమతులు జారీ

**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో లేవుట్ అనుమతులు జారీ అంశంలో నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లేఅవుట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ప్రతి లేఅవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను సాంకేతికతను వినియోగిస్తూ జిల్లా కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్ అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలన్నారు. చివరి నిమిషంలో నాలా కన్వర్జెషన్ సంబంధించి ఫీజు చెల్లింపులు చేసి సమావేశానికి తీసుకు వచ్చిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలించి పూర్తి స్థాయిలో అన్ని నిబంధనలు పాటిస్తున్నారో లేదో గమనించాలని కోరారు. లేఅవుట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌టిపిఎస్ ఎం. రాజేశ్వరి, సుడా సిపివో వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌ను విజయవంతం చేయండి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటనే కుటుంబ ఆరోగ్యవంతంగా, బలంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో ఐడిఓసిలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని వైద్యారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. మారిన జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల కారణంగా మహిళలు అధికంగా బిపి,షుగర్, గుండెసంబంధిత వ్యాధులు, పిసిఓడి, రుతుక్రమ సమస్యలు వంటి వాటికి గురవుతున్నారని, ఈ క్యాంపుల ద్వారా మహిళలు ఆరోగ్య పరిక్షణ జరుగుతుందన్నారు. అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదానం శిబిరం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, డిసిహెచ్ఓ రవిబాబు, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని స్వర్ణలత లెనినా, మున్సిపల్ కమీషనర్లు సుజాత, శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం

**- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్**





**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరామయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాచలం డిపో పరిధిలోని ఆర్టిసి టిం డ్రైవర్లు చేస్తున్న నిరసనకు బుధవారం సిపిఐ ప్రతినిధి బృంధం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన డిపో మేనేజర్ తిరుపతితో సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, ఏఐటియూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, నాయకులు ఏపూరి బ్రహ్మం, ఎస్‌వివిఎస్ నాయుడు, వంక మహేష్ తదితరులతో కలిసి సుమారు గంటపాటు చర్చలు జరిపారు. కార్మికుల డిమాండ్లు సరైనవే అని, డిఎంగా మీరు విధుల్లో చేరిన నాటి నుండి చేసిన సంస్కరణలను మీరే మార్పు చేయాలని కోరినప్పటికీ డిఎం తిరుపతి మొండి వైఖరి ప్రదర్శించడంతో చర్చలు విఫలమయ్యాయి. అనంతరం రవికుమార్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులకు మేలు చేసే రీతిలో డిఎం తీరు లేదని, రీజియన్ పరిధిలో ఎక్కడా లేని విధంగా పనిభారం భద్రాచలం డిపోలోనే ఉందని, దీనిలో మార్పులు చేసి కార్మికులకు మేలు చేయాలని కోరినప్పటికీ చూస్తామంటూ మాట దాటవేస్తున్నారని మండిపడ్డారు. పనిభారంతో కార్మికులు, మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అనారోగ్యాల పాలవుతూ విధులు నిర్వహించలేక పోతున్నారని చెప్పారు. అనంతరం డిఎం మొండివైఖరి మారాలని, కార్మికుల ఐఖ్యత వర్ధిల్లాల్లి, పని భారాన్ని తగ్గించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొండబాబు, సీతారామరాజు, చాడా శోభన్‌బాబు, నారపోగు ఏసు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న నిరసన..

గత మూడురోజులుగా ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా టిం డ్రైవర్‌లు అంతా ఐఖ్యతతో డిపో ఆవరణలోనే ఉండి విధులు బహిష్కరించి నిరనస తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారికి సిపిఐ, ఏఐటియూసి, సిపిఎం, సిఐటియూతో పాటు పలువురు సంఘీభావం తెలుపుతున్నారు. టిం డ్రైవర్లు డిపో ప్రాంగణంలోనే ఆల్పాహారం, మధ్యాహ్న,రాత్రి భోజనాలు చేస్తున్నారు.

# కార్యకర్తల కష్టమే నేటి అధికారం

**-ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగానే నేడు పార్టీ అధికారంలో కొనసాగుతుందని ఎస్‌సి కార్పోరేషన్ చైర్మన్ ప్రీతం తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొందయ్య అధ్యక్షతన దళిత విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రీతం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సిలకు రిజర్వు చేయబడిన అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలను గెలిపించుకునే బాధ్యత దళితులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సి కార్పోరేషన్ ద్వారా దళితులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం ఎస్సి కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేసిందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సి కార్పోరేషన్‌ను ప్రక్షాళన చేసి ఆర్థిక ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దళితుల సమస్యలను పార్టీ దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్సి సెల్ నాయకులు చెన్నారావు, దాసరి దానియేల్, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సాయికుమార్, గౌస్, గజ్జెల్లి వెంకన్న, సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సంగీతంతో మానసిక ప్రశాంత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆధ్యాత్మికత వైపు ప్రతి ఒక్కరి అడుగులు పడాలని పలువురు పాస్టర్లు అన్నారు. యువతను సంగీతం వైపు ఆకర్షించేలా పాటల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. నల్గొండ పట్టణంలోని టీఎన్‌జిఓఎస్ భవన్‌లో సియాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన పోటీలలో పలువురు ప్రారంభించి మాట్లాడారు. యువతలో ఆధ్యాత్మికత భావనను పెంపొందించే విధంగా భక్తి పాటల పోటీలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. సంగీతంతో మానసిక ప్రశాంతత అలవర్తుందని చెప్పారు. ప్రముఖ్ సంగీత దర్శకుడు ఆరోన్ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా పాటల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం పాటలు పాడిన వారికి బహుమతులను ప్రధానం చేసి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. సంగీత వాయిద్యాల నడుమ కోటిదారులు ఉత్సాహంగా పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దయా సాగర్, అభిషేక్ పాల్, అరోన్ వెస్లీ, రేచల్ గ్రేస్, శైలజ.సియన్ యూత్ నల్గొండ సభ్యులు డి ప్రేమ్ కుమార్, డి ప్రేమ్ కుమార్, టి ప్రవీణ్ కుమార్, జాకబ్ రోషన్, నోయల్, యు శ్రీకాంత్, ఆర్ సంపత్ కుమార్, బి సుమన్ రామన్, జి గోపి, సాల్మన్ రాజ్, స్టీఫన్ పాల్ పాస్టర్స్ మోజస్, సమర్పన్, ఎలీషా, యోవెల్, లవన్ కుమార్, స్టీఫన్ పాల్, సాల్మన్, హిమచంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణానికి చెందిన రాఘవేంద్ర కాలనీ నివాసి ఫారెస్ట్ అధికారిగా విశిష్ట సేవలు అందించి ఇటీవల పదవి విరమణ పొందిన ఉట్కూరు శేఖర్ రెడ్డి సతీమణి శ్రీదేవిని బుధవారం నాడు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వారి శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని కోరుకుంటూ వారి అనుభవాలన్నీ సమాజానికి ఉపయోగించాలని పర్యావరణ పరిరక్షణ కోసం వారు పాటుపడాలని కోరారు.సన్మానించిన వారిలో న్యూ స్కూల్ అధినేత గంట్ల అనంత రెడ్డి,డాక్యుమెంట్ రైటర్ నిమ్మల రాజశేఖర్ రెడ్డి,కాలం విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన ఐడిఓసిలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టర్ హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ పోరాట పటిమ నేటికి స్ఫూర్తిదాయకం అన్నారు. సమాజంలో ఆమె గొప్పతనాన్ని చాటాలని, నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, విజయలక్ష్మి, శ్రీలత, అజిత్‌కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగపల్లి రాజు, దురుశెట్టి కుమార్, విజయలక్ష్మి , కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం ఆదర్శం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చాకలి ఐలమ్మ జీవితం, పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని గ్రంధాలయంసంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధని పురస్కరించుకుని గ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూల మాలలేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భుమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముర్తి కోసం ఆమె చేసిన అలుపెరగని పోరాటం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆమె చూపిన తెగువ, పోరాట పటిమ ఎంతో గొప్పదని, ఆమె ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఎన్ని అడ్డంకులు ఎదురైనా మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించి సమసమాజ స్థాపనకు పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు మణిమృదుల, పాఠకులు ఉపేందర్, పలు పాఠశాలల విద్యార్థిలు పాల్గొన్నారు.

# రాజీ మార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజీమార్గం ద్వారానే కేసులు పరిష్కరించుకోవాలని, ఇందు కోసం ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా నాయ్యసేవాధికారసంస్థ కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన లైబ్రెరీ సమావేశ మందిరంలో ఆయన న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు తమ వివాదాలను సామరస్యంగా, త్వరిత గతిన పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాజీకు వీలయ్యే సివిల్, క్రిమినల్‌తో పాటు పలు రకాలు కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, గోపికృష్ణ, అడబాల పార్వతి, చిన్నకృష్ణ, పురుషోత్తంరావు, నిరంజన్ రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోరాట స్ఫూర్తికి ప్రతీకగా చాకలి ఐలమ్మ నిలుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంఘ సేవకురాలిగా భూమి, భూక్తి విముక్తి కోసం జరిగిన పోరాటంలో మహోన్నత పాత్ర నిర్వహించిన ఐలమ్మ ధన్యురాలన్నారు. చాకలి ఐలమ్మ వర్థంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు జి. జ్యోతి పాల్గొన్నారు.